క్లుప్తంగా

మంత్రి దామోదరకు సన్మానం



మంత్రి దామోదర రాజనర్సింహాకు మొక్కను బహూకరిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎస్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకులు నీలం మధు ముదిరాజ్ హైదరాబాద్ మినిస్టర్ కోటర్స్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించి మొక్కను బహూకరించారు. అనంతరం మంత్రితో నీలం మధు ముచ్చటించారు.

రేపు నిధి ఆప్‌కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ఈ నెల 27న నిధి ఆప్‌కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ శ్రీవిశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్ జయభేరి వర్క్‌షాప్, సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని అక్షయ పాత్ర ఫౌండేషన్, సంగారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్, భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న 3 కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలో చెక్‌పోస్టును అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నిబంధనలను మేరకు రూ.50వేల కంటే ఎక్కువ డబ్బు రవాణా చేస్తే తప్పనిసరిగా నగదుకు సంబంధించిన రశీదు ఉండాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): వచ్చే నెల 5వ తేదీన లక్ష్మీనర్సింహ కల్యాణోత్సవం, 6వ తేదీ రథోత్సవాన్ని ఆత్మానందాశ్రమ పీఠాధిపతి పూజ్య పాద రాజయోగి వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆత్మానందాశ్రమ అధ్యక్షుడు భానుప్రకాష్ తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని అల్లాపూర్, పిల్లోడి, గార్లపల్లి, చీలపల్లి, మన్‌సాన్‌పల్లి గ్రామాల్లో సోమవారం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు గోపాల్, నర్సింహులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌కు సన్మానం



బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జహీరాబాద్: జహీరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గోపాల్‌ను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఆయన వెంట రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి భాస్కర్ ఉన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ జాతర

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ జాతర ఈ నెల 26 నుంచి 30వరకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి నిత్య పూజలతో పాటు అభిషేకం, రాత్రికి బోనాలు, అనంతరం ఎల్లమ్మ జీవిత చరిత్ర ఒగ్గుకథ, 28న ఎడ్లబండ్ల ఊరేగింపు, రాత్రి ఎల్లమ్మ జీవిత చరిత్ర రెండవ భాగం ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

ఏకగ్రీవ ఎన్నిక

పటాన్‌చెరు: సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శిగా వాజీద్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో సోమవారం ఆ పార్టీ ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి.వాజిద్ అలీని ఏరియా కమిటీ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. సభ్యులుగా పెంటయ్య, జయకుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వాజిద్ అలీ మాట్లాడుతూ.. పటాన్‌చెరు ప్రాంతంలో సీపీఎం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయత్ రాజ్
రోడ్లకు గ్రహణం!



గుంతలమయంగా మారిన జహీరాబాద్- అల్గోల్ రోడ్డు

జహీరాబాద్ నియోజకవర్గంలో పంచాయత్‌రాజ్ రోడ్లకు గ్రహణం పట్టింది. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న 26 రోడ్ల మరమ్మతుల కోసం రూ.51.88 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కాగా నిధులు మంజూరై రెండేళ్లు గడిచినా టెండర్ ప్రక్రియను పూర్తిచేయలేదు. దీంతో బిల్లులు రావన్న ఉద్దేశంతో టెండర్ వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఏడాది తరువాత ఎట్టకేలకు హైదరాబాద్‌కు చెందిన షీబా కంపెనీ టెండర్ వేసి పనులు దక్కించుకొని ఎల్గోయి, పోట్‌పల్లి, అల్గోల్ రోడ్లకు మాత్రమే మరమ్మతు పనులను పూర్తి చేసింది. ఈ క్రమంలో అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడం.. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో నిధుల విడుదల నిలిచిపోయి రోడ్ల మరమ్మతులకు బ్రేక్ పడింది.

– జహీరాబాద్ టౌన్

- మరమ్మతు పనులకు రూ.51.88 కోట్లు మంజూరు
- టెండర్ ప్రక్రియలో తీవ్ర జాప్యం
- ఆలస్యంగా పనులు ప్రారంభం
- ఎన్నికల కోడ్‌తో నిధులకు బ్రేక్
- అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు

నియోజకవర్గంలోని జహీరాబాద్, కోహీర్, న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లోని ఆయా గ్రామాల పంచాయత్‌రాజ్ శాఖకు చెందిన రోడ్లు దెబ్బతిని అధ్వాన్నంగా తయారయ్యాయి. దెబ్బతిన్న రోడ్లపై వాహనాల రాకపోకలకు కష్టంగా మారింది. దెబ్బతిన్న రోడ్ల గురించి ఎమ్మెల్యే మాణిక్‌రావు పలుమార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. 2022 సంవత్సరంలో మాజీ సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా హరీశ్‌రావు అప్పటి సీఎం దృష్టికి తీసుకెళ్లగా 26 రోడ్ల మరమ్మతులకు రూ.51.88 కోట్లను మంజూరు చేస్తూ ఉత్తర్వులను సైతం జారీ చేశారు.

నిధులు మంజూరు ఇలా..

ఝరాసంగం మండలంలోని ఎల్గోయి-మొక్కన్‌పాడ్ రోడ్డుకు రూ.90లక్షలు, రాయిపల్లి-కృష్ణపూర్, బిడెకన్న రోడ్డుకు రూ.95లక్షలు, ఎల్గోయి-అల్గోల్-పోట్‌పల్లికి రోడ్డుకు రూ.1.70 కోట్లు, ఝరాసంగం-సిద్దాపూర్-రుక్మపూర్ రోడ్డు మరమ్మతులకు రూ.2.05కోట్లు, ఝరాసంగం-చిలెమామిడి రోడ్డుకు రూ.3.60కోట్లు, బోప్పన్‌పల్లి, ఈదుపల్లి, ప్యాలరం, దేవరంపల్లి రోడ్డుకు రూ.2.80 కోట్లు మంజూరయ్యాయి. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్-రాంతీర్థం రోడ్డుకు రూ.1.55 కోట్లు, గణేష్‌పూర్ గ్రామం వరకు ఉన్న రోడ్డుకు రూ. 79.50 లక్షలు, శంశెల్లాపూర్-వడ్డీ రోడ్డుకు రూ.65లక్షలు, చాల్కి-కర్నాటక రాష్ట్ర సరిహద్దు వరకు ఉన్న రోడ్డుకు రూ.4.50 కోట్లు, గంగ్వార్-బసంత్‌పూర్-మామడ్గి రోడ్డుకు రూ.1.98కోట్లు మంజూరయ్యాయి. జహీరాబాద్ మండల పరిధిలోని బూచినెల్లి నుంచి కర్నాటక రాష్ట్ర సరిహద్దు వరకు ఉన్న రోడ్డుకు రూ.2.13కోట్లు, జహీరాబాద్-పోట్‌పల్లి రోడ్డుకు రూ.3.66కోట్లు, బిడెకన్న-రాయిపల్లి(డి) రోడ్డు మరమ్మతులకు రూ.95లక్షలు, అల్లీపూర్ రోడ్డుకు రూ.90లక్షలు మంజూరయ్యాయి. కోహీర్ మండలంలోని బడంపేట-మనియార్‌పల్లి రోడ్డు మరమ్మతులకు రూ.1.45కోట్లు, పోతిరెడ్డిపల్లి-కోహీర్ రోడ్డుకు రూ.3.30కోట్లు, పిచరాగడి-పిచరాగడి తండా రోడ్డుకు రూ.1.42 కోట్లు, ఖనాపూర్-సజ్జపూర్ రోడ్డుకు రూ.1.22 కోట్లు, శేఖాపూర్-బడంపేట రోడ్డుకు రూ.1.30కోట్లు మంజూరయ్యాయి.

ఇబ్బందులు తప్పడంలేదు



బూచినెల్లి నుంచి కర్నాటక రాష్ట్ర సరిహద్దు వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు రూ.2.13 కోట్లు మంజూరు చేసింది. కానీ.. రెండేళ్లు దాటినా నేటికీ పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

– శ్రీనివాస్, బూచినెల్లి గ్రామస్తుడు

నిధులు రద్దు అయ్యాయి

గత ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైన మాట వాస్తమే. కానీ.. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకురాని కారణంగా టెండర్ ప్రక్రియలో జాప్యం జరిగింది. మొత్తం 26 రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా ఎల్గోయి-అల్గోల్ రోడ్డుకు మాత్రమే మరమ్మతులు పూర్తయ్యాయి. మిగతా రోడ్ల పనులు చేపట్టలేదు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం నిధుల మంజూరును రద్దు చేసింది.

– కృష్ణ, పంచాయత్‌రాజ్ ఏఈ

దెబ్బతిన్న రోడ్లతో అవస్థలు

గుంతలమయంగా మారిన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరై రెండేళ్లు గడిచినా అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తిచేయలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు గుంతలమయమైన రహదారులపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో అంతలోనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు మంజూరు చేసిన నిధులను క్యాన్సల్ చేయడంతో నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. కోడ్ ముగిసిన వెంటనే పనులు చేపట్టి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

గీతం స్కాలర్ రేఖకు డాక్టరేట్



రేఖ

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని రేఖను డాక్టరేట్ వరించింది. 'అనిశ్చితి పరిమితులతో కూడిన బలమైన విరామం-విలువ గల ఆప్టిమైజేషన్ సమస్యలకు కొంత సహకారం' అనే అంశంపై ఆమె అధ్యయనం చేసి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణితశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ కుమ్మరి సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అనిశ్చిత డేటాతో ఆప్టిమైజేషన్ సమస్యలను నిర్వహించడానికి రేఖ పరిశోధన బలమైన ఆప్టిమైజేషన్ మెథడాలజీలపై దృష్టి సారించిందని తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), బిగ్ డేటా, కృత్రిమ మేథ వంటి సాంకేతికతలు పెరుగుతున్న వినియోగంతో విస్తారమైన విభిన్నమైన డేటా విశ్లేషణ కీలకంగా మారినట్టు తెలిపారు. ఈ సిద్ధాంత వ్యాసం, ఆప్టిమైజేషన్ సమస్యలలో అనిశ్చితిని పరిష్కరించడానికి వినూత్న పద్ధతులను ప్రవేశపెట్టిందని వివరించారు. రేఖ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, అదనపు ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అభినందనలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామంలో ఉన్న భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. ప్రతినెల స్వామివారి సన్నిధిలో చండీహోమం నిర్వహిస్తున్నామని ఈఓ శశిధర్, నిర్వాహకులు సోమయ్య తెలిపారు.

హోలీ.. ఆనందాల కేళీ

జిల్లావ్యాప్తంగా హోలీ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరికొకరు రంగులు చల్లుకొని హోలీ సంబరాల్లో మునిగి తేలారు. చిన్నారులు ఆడుతూ పాడుతూ కేరింతలతో వీధుల్లో సందడి చేశారు. ఆయా గ్రామాల్లో యువకులు ఉత్సాహంగా ఉట్లు కొట్టి ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



హత్నూర: హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు, చిన్నారులు



ఝరాసంగం: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



జహీరాబాద్ టౌన్: రాచన్నపేటలో...



సంగారెడ్డి: హోలీ ఆడుతున్న చిన్నారులు



జిన్నారం: జిన్నారంలో ...



రామచంద్రాపురం: హోలీ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్ప, కాలనీవాసులు



సంగారెడ్డి టౌన్: హోలీ ఆడుతున్న చిన్నారులు



ఝరాసంగం: కృష్ణాపూర్ గ్రామంలో...



పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ గ్రామంలో...



కల్హేర్: బల్కంచెల్క తండాలో...



నారాయణఖేడ్‌లో ...



రాయికోడ్‌లో..



న్యాల్‌కల్: మల్గి గ్రామంలో ఉట్టి కొడుతున్న యువకులు



కోహీర్: చనందికట్ట గ్రామంలో...

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



కృష్ణ(ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చింతల చెరువు గుండ్ల మాచునూర్ ప్రధాన రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. గుండ్ల మాచునూరు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. హత్నూర మండలంలోని గుండ్ల మాచునూర్ గ్రామానికి చెందిన మొండి కృష్ణ సోమవారం తన ద్విచక్ర వాహనంపై చింతలచెరువుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఆరుట్ల గ్రామ శివారులోని స్టోన్ క్రషర్ల సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. స్టోన్ క్రషర్ నుంచి అధిక లోడుతో వెళ్లే వాహనం ఢీకొట్టడంతోనే కృష్ణ మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంగారెడ్డి టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వినయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19వ తేదీన పోతిరెడ్డిపల్లి చౌరస్తా శివాలయం వద్ద ఓ వ్యక్తి అనారోగ్యానికి గురై పడి ఉండడంతో గమనించిన పూజారి గోపాల్‌రెడ్డి అతడిని అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహం సంగారెడ్డి ప్రభుత్వం మార్చురీలో ఉన్నట్లు, ఆచూకీ తెలిసినవారు రురల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

మరో సంఘటనలో...

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని బాలానగర్‌కు చెందిన మాలే కాశీనాథ్ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొంతకాలంగా కాశీనాథ్ అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన బాలానగర్‌లో ఉండే తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన వెళ్లిన కాశీనాథ్ పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ మంజీర వెంచర్ సమీపంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం బీరంగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి భార్య కావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ద్వాదశ వార్షిక మహాలక్ష్మీయాగంలో భాగంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 12 నదుల తీర్థములు, పంచామృత అభిషేకం, సామ్రాజ్యలక్ష్మీ హోమం చక్రస్నానం, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీనరసింహ భార్గవ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారిని చక్రస్నానానికి తీసుకెళ్తున్న అర్చకులు

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ శంకర్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటలోని రెండో వార్డులో వినియోగంలో లేని బోరుమోటార్లను మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భజలాలు అడుగంటుతుండడంతో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జహీరాబాద్‌కు చేరిన పాదయాత్ర

న్యాల్‌కల్(జహీరాబాద్): బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి సిద్దేశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర ఆదివారం రాత్రి హద్నూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గంగ్వార్, మిర్జాపూర్(బి) మీదుగా జహీరాబాద్ మండలంలోకి సోమవారం ఉదయం ప్రవేశించింది.

బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా రుషబ్

జహీరాబాద్ టౌన్: బీజేవైఎం జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా రుషబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో సోమవారం ఆ పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా రుషబ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గం కన్వీనర్ నరేష్‌పాటిల్, బీజేవైఎం నాయకులు సామ అనిల్, బీజేపీ నాయకులు అరుణ కొలాస్, పాలింకార్ సంతోష్, అర్చన సరడా, అప్పం శ్రవణ్, నీలేష్ పాల్గొన్నారు.

గిరిధర్‌రెడ్డికి సన్మానం



గిరిధర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్: రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్‌రెడ్డి నియమితులై మొదటిసారి జహీరాబాద్ వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.